www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 జూన్ 2024
5
తూర్పుగోదావరి



బక్రీద్ నేపథ్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

సోమవారం బక్రీద్ పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పి పి.జగదీష్ తెలిపారు. ముస్లిం మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో సుఖ సంతోషాల నడుమ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ జరుపుకోవాలని కోరారు. మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హైకోర్టు ఆదేశాలపై జంతువుల అక్రమ రవాణా, గోవధ నిరోధానికి జిల్లాలో డిఎస్పి కె.శ్రీనివాస మూర్తిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామన్నారు.

ప్రమాదకరంగా బడి ఆటో

- ప్రశ్నార్థకంగా విద్యార్థుల ప్రయాణం
- కిక్కిరిసిన ఆటోల్లో పాఠశాలలకు
- పరిమితికి మించినా పట్టించుకోని అధికారులు
- పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పుస్తకాలు, యూనిఫారం, లంచ్ బాక్సులు లాంటి వస్తువులు కొనడంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వాటన్నింటికంటే ముఖ్యమైనది పిల్లలు పాఠశాలకు చేరే విధానంపై ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని సంబంధింత వాహనాల యాజమాన్యాలు వారి ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఆటోలు ముందు వరుసలో ఉన్నాయి. డబ్బు సంపాదనే తప్ప పిల్లల ప్రాణాల గురించి చాలామంది ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఎంత మంది పిల్లలను ఎక్కిస్తే అంత ఆదాయం వస్తోంది అనే ఆలోచనలోనే డ్రైవర్లు ఉంటున్నారు. ఇదే ప్రమాదాలకు ముఖ్యకారణంగా మారుతోంది. స్కూల్ బస్సుల సమాచారం పూర్తిగా రవాణాశాఖ అధికారుల దగ్గర ఉంటుంది. కాబట్టి వీరు కొంతమేరకు నిబంధనలు పాటిస్తుంటారు. కానీ స్కూల్ ఆటోల సమాచారం అధికారుల వద్ద ఉండదు. ఈ ఆటోలకు రవాణా శాఖ నుంచి ప్రత్యేకమైన అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. దీంతో అధికారులు కూడా వీటిని నియంత్రించలేక పోతున్నారు.

ఇరుకు రహదారుల్లోనూ అతివేగం

జిల్లాలో సుమారు పదివేల ఆటోలు ఉంటాయని అంచనాగా తెలుస్తోంది. ఎక్కువ శాతం ఆటోలు ప్రధాన రహదారుల నుంచి కాక సందుల్లో, చిన్నచిన్న రోడ్ల వెంట పిల్లలను తీసుకెళుతుండడంతో వీటిపై నియంత్రణ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆటోలపై తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను కుక్కి అతివేగంగా డ్రైవర్లు ఆటోలను తోలుతున్నారు. ఒకవైపు పాఠశాల సమయం ముగుస్తుందని గేటు వేస్తారని ముందు వెనక చూసుకోకుండా దూసుకు వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాల నిర్లక్ష్యంతో పాఠశాలల ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రైవేట్ బస్సులకు ఫీజులు చెల్లించే స్థోమత లేని కారణంగా తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోలో పంపించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక పల్లెల నుంచి సరైన బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఆటోలు, టాటా మ్యాజిక్ లాంటి వాహనాలను పాఠశాల విద్యార్థులను తరలించేందుకు జిల్లాలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలకు సంబంధించి ఎప్పటి నుంచో ఉన్న నిబంధనలను ఆటో డ్రైవర్‌లు పాటించడం లేదు. సాధారణ ఆటోలలో విద్యార్థులను ఆరుగురికి మించి ఎక్కించకూడదు. టాటా మ్యాజిక్‌లో 10 మందికి మించకూడదు. డ్రైవర్ల పక్కన ఎట్టి పరిస్థితుల్లో కూర్చోపెట్టకూడదు. స్కూల్ ఆటోలకు సైడు రాడ్లు తప్పక అమర్చాలి. ప్రతి స్కూల్ ఆటోలో ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి. ఆటోలకు సంబంధించిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఎఫ్‌సి సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాలు అందుబాటులో ఉంచుకోవాలి. డ్రైవర్ యూనిఫారం తప్పని సరిగా ధరించాలి. ఈ నిబంధనలు పాటించకుండా పోలీసు, రవాణాశాఖ దారుల్లో పట్టుబడితే జరిమానాలు భారీగా ఉంటాయని అధికారులు తెలుపుతున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడి ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే భారీ జరిమానాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త

ఆటోలలో డ్రైవర్ సీటుకు అటు, ఇటు, లోపల కాస్తా కూడా ఖాళీ లేకుండా విద్యార్థులను ఎక్కించుకుంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఆటోలలో విద్యార్థుల రాకపోకలు మాత్రం ఆగడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత బాధ పడేకంటే తల్లిదండ్రులు ముందే మేల్కొనాలి. బడి పిల్లలను ఆటోలలో స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు ఆటోలలో అసలు ఎంత మంది వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారు అనే విషయం ముందుగానే తెలుసుకోవాలి. ఆటో డ్రైవర్ పూర్తి వివరాలు ప్రతి తల్లిదండ్రుల వద్ద ఉండాలి. డ్రైవర్ ఎంత స్పీడ్‌లో వెళ్తున్నాడో, పిల్లలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో ఎప్పటికప్పుడు పిల్లలను అడిగి తెలుసుకోవాలి. ఆటో సమాచారాన్ని సంబంధిత పాఠశాలలకు తల్లిదండ్రులే అందించాలి. స్కూల్ యాజమాన్యాలు, సిబ్బంది కూడా వారి స్కూళ్లకు ఎక్కువ మంది పిల్లలను తీసుకువచ్చే ఆటోలను అనుమతించకూడదు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే స్కూళ్లకు చెడ్డపేరు వస్తుందని యాజమాన్యం కూడా గుర్తించాలి. ఆటో ప్రయాణాలపై బాధ్యతగా మెలగాలి.



చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

గోపాలపురంలో గాలి వాన బీభత్సం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈదురు గాలులతో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలి వాన బీభత్సానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చెట్లు విరిగి పడడంతో గోపాలపురం నుంచి జగన్నాథపురం వరకు సుమారు పది కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పోలీస్ యంత్రాంగం గోపాలపురం శివారు నేషనల్ హైవే ఫ్యాక్టరీ వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన 4 వృక్షాలను జెసిబి సాయంతో తొలగించారు. గంటకు పైగా వేలాది వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు భారీ వర్షంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. విద్యుత్ శాఖ యంత్రాంగం విరిగి పడిన స్తంభాలను పునరుద్ధరించారు. సుమారు రెండు గంటలు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు, తాడిపూడి కాలువలో వరద నీరు భారీగా ప్రవహించింది.

పిడుగుపాటుతో రెండు చూడి గేదెల మృత్యువాత...

గోపాలపురం బిసి కాలనీకి చెందిన రైతు మరీదు వెంకట దుర్గాప్రసాద్‌కు చెందిన రెండు చూడి గేదెలు పిడుగులు పడడంతో మృత్యువాత పడ్డాయి. రూ.1.60 లక్షల విలువైన ఆ గేదెలు మరొక పది రోజుల్లో దూడలను పెట్టేవని ఆయన కన్నీరు మున్నీరయ్యారు. గేదెలపైనే తాను జీవనోపాధి పొందుతున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పర్యాటక రంగం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నిడదవోలు

పర్యాటక రంగాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. నూతనంగా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం 38 అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంత్రి దుర్గేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. నిడదవోలు నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ప్రజలకు పారదర్శకంగా జవాబుదారీగా ఉంటానని చెప్పారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సంఘం, కిరాణా జనరల్ మర్చంట్స్, బ్రాహ్మణ సంఘం, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, రమేష్, కేదశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ బత్తుల

ప్రజారోగ్య రక్షణకు చర్యలు

ప్రజాశక్తి - సీతానగరం

సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కాబట్టి ప్రజారోగ్య రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ పంచాయతీ అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. వ్యర్థ పదార్థాల సమగ్ర నిర్వహణకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన తాగునీటి సరఫరా విషయంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అత్యంత కీలకమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఏ విధమైన లోటుపాట్లు లేకుండా సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆదేశించారు. మాతా శిశు సంక్షేమంపై సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తామన్నారు. డిఆర్‌డిఎ, సెర్ప్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఎంఎల్‌ఎకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి మహేశ్వర ప్రసాద్, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జనార్ధన్ రావు, ఎపిఎం జయంతి రాజ్, కె.హేమ నాగలక్ష్మి, ఇ.మహాలక్ష్మి పాల్గొన్నారు.

కందుల దుర్గేష్‌కు మంత్రి పదవిపై హర్షం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర క్యాబినెట్‌లో నిడదవోలు ఎంఎల్ఎ కందుల దుర్గేష్‌కు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి పదవి దక్కడం పట్ల నియోజవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈసారి రాష్ట్ర క్యాబినెట్లో నిడదవోలు ఎంఎల్ఎ కందుల దుర్గేష్‌కు స్థానం లభించడంతో నియోజకవర్గ రూపురేఖలు మారుతాయని ఆశాభావం ప్రజలలో నెలకొంది. గతంలో నిడదవోలు ప్రాంతం వివిధ నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, ప్రత్యేక నియోజకవర్గం ఏర్పడిన తర్వాత వచ్చిన మంత్రి పదవిని ఈ ప్రాంత అభివృద్ధి కోసం వినియోగించి, ప్రాంత అభివృద్ధితో పాటు, ప్రజల జీవన స్థితిగతులు కూడా మెరుగు పరిచే విధంగా ఆ శాఖ మంత్రి పనితీరుతో ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నారు. పర్యాటక, సినీ పరిశ్రమకు సంబంధించి అభివద్ధి చేస్తే స్థానిక యువతకు పలు రకాల ఉపాధి, అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు పరీవాహక ప్రాంతంలో అనేక పురాతన దేవాలయాలు, పెరవలి మండలం తీపర్రులో పుష్కరాల రేవు, ఉండ్రాజవరం మండలం పాలంగిలో రామ ఘట్టాలు, నిత్యం నీటిలో ఉండే శివలింగంతో శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం, ఇలా పలు ప్రదేశాలు ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ప్రాధాన్యత కలిగి ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. సూపర్ హిట్ సాధించిన సినిమాలు అనేకం ఈ ప్రదేశాలలో చిత్రీకరించినవేనని వారు గుర్తు చేస్తున్నారు.

ఆలయాల భూముల రక్షణకు కృషి

ప్రజాశక్తి - సీతానగరం

దేవాలయాల భూములను, ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఎవరైనా భూములను ఆక్రమిస్తే సహించేది లేదని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. దేవాలయాల ఆస్తులను, భూములను పరిరక్షించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. నియోజకవర్గంలో 17 దేవాలయాలు, 2 సత్రాలకు సంబంధించి ఆస్తులను పరిరక్షించి దాతల ఆశయాలను కాపాడాలని ఎమ్మెల్యే కోరారు. దేవుడుకి సంబందించిన భూముల విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా ముందుకు సాగాలన్నారు. ఈ విషయంలో దేవాదాయ ధర్మాధాయ శాఖ అధికారులు, కార్య నిర్వహణ అధికారులు ఏ విధమైన ఒత్తిడులకు తలెత్తకుండా పనిచేయాలని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, దేవస్థానానికి సంబందించిన ఆస్తులు, భూముల వివరాలతో పాటు కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, అక్కడ నెలకొన్న సమస్యలను దేవాదాయ ధర్మాదాయ శాఖ అన్నవరం డిప్యూటి కమిషనర్ రమేష్ బాబు ఎంఎల్ఎ బత్తులకు వివరించారు. కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సంబంధించి రాజగోపురం నిర్మాణానికి సహకారం అందిస్తానని ఎంఎల్ఎ తెలిపారు. వివిధ దశల్లో ఉన్న 22 గుడుల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్నవరం డిఇ ఉదయ్ కుమార్, నియోజకవర్గంలోని పలు ఆలయాల ఇఒలు, అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చాగల్లు : స్థానిక నేలటూరు సీతారామ కళ్యాణ మండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. 1977-78 సంవత్సరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కుటుంబాలు కలుసుకున్నాయి. ఆనాటి ఉపాధ్యాయులు కారుపాటి వివేకానంద, జి.నాగేశ్వరావు, విజయలక్ష్మి దంపతులు, రత్నబాల, బి.కృష్ణమూర్తిలను ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆళ్ల చంద్రశేఖర్, పెంజర్ల గణేష్, షేక్ గఫూర్, జయలక్ష్మి, ఉషారాణి, ఇంద్రారాణి పద్మిని పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విజయోత్సవాలు

తాళ్లపూడి : ప్రజల ఆదరణతో కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా కొవ్వూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంఎల్ఎ, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి టివి.రామారావు అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో ఆయన తైలం నాగేశ్వరరావు ఇంటి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్తా అంకుటిత దీక్షతో పని చేసి అన్ని స్థానాల్లోనూ విజయ డంకా మోగించారన్నారు. ఈ సందర్భంగా రామారావును ఘనంగా సత్కరించారు. ఈ సంబరాలలో బుద్దాల గాంధీ, తైలం బాబ్జి, తైలం పోసియ్య, కె.సత్తియ్య, బి.హరి, కె.గణేష్, బి.వెంకన్న బాబు, బి.బంగార్రాజు తదితరులు ఉన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

నిడదవోలు : పట్టణంలోని చిన్నకాశిరేవు వద్ద నుంచి ఆదివారం ప్రారంభమైన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి రథోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎంఎల్ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు, కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, 27 వార్డు కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, కేదారశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ ముప్పిడికి కార్మికుల వినతి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో ఆదివారం కలిసి సమస్యలను వివరించరాఉ. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర్ బాబు మాట్లాడుతూ అందరికీ ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్థానిక భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇసుకను ఒడ్డుకు చేర్చే నావ, ఇసుక కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ఎంఎల్ఎ ముప్పడి వెంకటేశ్వరరావు కార్మికులతో మాట్లాడుతూ త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో నిర్మాణ కార్మికులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, జొన్నల రాంబాబు, మాణిక్ రెడ్డి, హరిబాబు, రేఖ నాగేశ్వరరావు ఎంఎల్ఎను కలిసిన వారిలో ఉన్నారు.

పైడిమెట్ట పథకం నుంచి నీటి విడుదల

ప్రజాశక్తి-తాళ్లపూడి

రైతుల అభివృద్ధి కోసం టిడిపి అహర్నిశలు పని చేస్తుందని ఆ పార్టీ యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య అన్నారు. మండలంలోని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం నుంచి ప్రస్తుత పంటలకు అవసరమైన సాగునీటిని ఆదివారం విక్రమాదిత్య



పైడి మెట్ట పథకం నుంచి నీరు విడుదల చేస్తున్న విక్రమాదిత్య

విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లూరి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఎన్‌డిఎ కూటమితో ఏర్పాటైన టిడిపి ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతు ముళ్ళపూడి రామచంద్రం మాట్లాడుతూ రైతులు నీటి తీరువా బకాయిలను సకాలంలో చెల్లించి ఎత్తిపోతల పథకం నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పైడిమెట్ట పథకం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు నాయకులు రైతులు జివి.ప్రసాద్, కాకర్ల సత్యేంద్ర, కె.గణేష్, టి.భరత్, టి.రమేష్, ఐ.అబ్బులు, వి.రామకష్ణ, ఎల్.సూరిబాబు, కె.దత్తుడు, కె.చంద్రశేఖర్, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'




తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్య

ఎస్ఎంఆర్ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ సొంతం

ప్రజాశక్తి -గోకవరం

ఎస్ఎంఆర్ అండ్ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని స్కూల్ కరెస్పాండెంట్ సారేపల్లి రామ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని తంటికొండ, గోకవరం గ్రామాల్లో నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విద్యను అందిస్తున్నామని చెప్పారు. 80 మంది విద్యార్థులతో 2014లో స్కూల్ ప్రారంభించి 2024కు 500 మంది విద్యార్థులతో అంచెలంచెలుగా ఎదిగామన్నారు. విద్యను వ్యాపారంలా కాకుండా పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. తంటికొండలో 2014, గోకవరంలో 2023 నుండి దాసరి వారి వీధిలో నూతనంగా బ్రాంచ్ ప్రారంభించామన్నారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విద్యను కొనసాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం విద్యా సంస్థల్లో 500 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు ఉన్నట్టు తెలిపారు. క్వాలిఫైడ్ డిఇడి, బిఇడి శిక్షణ పొందిన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నామన్నారు. ఆర్‌టిఐ యాక్ట్ ప్రకారం గవర్నమెంట్ నియమ నిబంధనల ప్రకారం 25 శాతం ఉచితంగా పేద పిల్లలకు విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ఏటా అబాకస్ మ్యాథమెటిక్స్ పరీక్షల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 5వ ర్యాంకు సాధించడం ఎస్ఎంఆర్ అండ్ విద్య సంస్థల ప్రత్యేకత అని తెలిపారు. ఏటా నవోదయ ప్రవేశ పరీక్షలకు, సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నవోదయకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.





విద్యార్థులకు యోగా శిక్షణ



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం



ఎస్ఎంఆర్ అండ్ విద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ భవనం

స్కూల్ ప్రత్యేకతలు

- ఆహ్లాద వాతావరణంలో క్రమశిక్షణతో కూడిన విద్య
- పోటీతత్వాన్ని అలవర్చుకునేలా శిక్షణ
- కంప్యూటర్ పరిజ్ఞానంపై పూర్తిస్థాయి దృష్టి
- వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- వీక్లీ, మంత్లీ టెస్టులు, తల్లిదండ్రులకు సమాచారం
- విశాలమైన తరగతి గదులు
- అత్యుత్తమమైన విద్యాబోధన
- కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శ్రద్ధ
- హ్యాండ్ రైటింగ్, అబాకస్‌పై ప్రత్యేక దృష్టి
- ఐఐటి మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ
- యోగ, కూచిపూడి డాన్స్‌పై ప్రత్యేక శిక్షణ
- దూర ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం

నేరాలు ఘోరాలు

మహిళ దారుణ హత్య
-పోలీసుల అదుపులో భర్త
-బెట్టింగులే హత్య కారణమా..?

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నిద్రిస్తున్న మహిళను రాయితో తలపై మోది హత్య చేసిన సంఘటన కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామం ఫిషింగ్ హార్బర్ పేటలో చోటు చేసుకొంది. కాకినాడ డిఎస్‌పి హనుమంతరావు తెలిపిన వివరాలు మేరకు...కాకినాడ రూరల్ ఫిషింగ్ హార్బర్ పేటలో ఒలేటి సీత (25) రొయ్యల ఫ్యాక్టరీలోనూ, ఆమె భర్త నరసింహమూర్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో మృతురాలు సీత పక్కనే ఉన్న మరొక గదిలో నిద్రించడానికి వెళ్ళింది. భర్త నరసింహం తెల్లవారు జామున డ్యూటీ నిమిత్తం బయలుదేరే సమయానికి భార్య సీత తలపై రాయితో మోదీ హత్యకాబడి ఒంటి మీద ఉన్న బంగారు వస్తువులు చోరీకి గురయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకొన్న సర్పవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతిరాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త నరసింహమూర్తిని అదుపులోకి తీసుకుని అనుమానస్పద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమెకు నాలుగేళ్ల పాప, మూడేళ్ల బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

బెట్టింగే ఈ హత్యకు కారణమా?

వివాహిత ఓలేటి సీత అనుమానస్పద మృతికి భర్త వేసిన బెట్టింగుల ప్రభావమే కారణమనే చర్చ జరుగుతోంది. గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తను అభిమానించే రాజకీయ పార్టీ గెలుస్తుందని మృతిరాలి భర్త నరసింహమూర్తి బెట్టింగులు వేశాడు. ఈ క్రమంలో రూ.3.50 లక్షల అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో గత వారం రోజులుగా బెట్టింగ్‌లో ఓడిపోయిన సొమ్మును చెల్లించేందుకు మృతిరాలి ఒంటిపై ఉన్న బంగారు నగలను ఇవ్వాలని భార్యను వేదిస్తున్నాడు. ఈ విషయాన్ని మృతురాలు ఆమె తల్లితండ్రులకు తెలుపగా వారు కొంత నగదును అప్పు చేసి తీర్చారు. మిగిలిన అప్పు నిమిత్తం బంగారు నగలు ఇవ్వాలని మృతిరాలిని భయపెడుతున్నాడు. హత్య జరిగిన రోజు రాత్రి భార్యభర్తల మధ్య తీవ్రస్థాయిలోనే వాగ్వివాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే భార్యను అర్ధరాత్రి సమయంలో బండరాయితో తలపై మోదీ హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు వస్తువులను ఎత్తికుపోయి ఎవ్వరో ఆమెను హత్య చేసినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెలిచెరు గ్రామానికి చెందిన తిరుమలనాధుని రామచంద్రరావు(38) గ్రామంలో ఎరువులు కొట్టు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల కాలంలో వ్యాపారంలో నష్టాలు రావడం వలన ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా హుటాహుటిన రామచంద్ర రావును రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న లారీతో అధికారులు

పిడిఎస్ బియ్యం వ్యాన్ సీజ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

30 వేల కేజీల పిడిఎస్ బియ్యంతో వెళుతున్న లారీని సీజ్ చేసినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. నల్లజర్ల మండలం లోని జగన్నాథపురం పుంత రోడ్డు సమీపంలో పిడిఎస్ బియ్యంతో వెళుతున్న లారీని పట్టుకున్నట్టు తెలిపారు. బియ్యంను జగన్నాథపురం పుంత రోడ్డులో శ్రీను అనే వ్యక్తి లారీలో లోడ్ చేసినట్టు లారీ డ్రైవర్ కార్తీక్ తెలిపాడన్నారు. ఈ బియ్యం ఛత్తీష్‌ఘడ్‌కు చెందిన రాధాకృష్ణ ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రవాణా చేస్తున్నట్టు తెలిపారు. రేషన్ బియ్యం విలువ సుమారు రూ.56.65 లక్షలు ఉంటుందన్నారు. సివిల్ సప్లయ్స్ అధికారులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నేడు బాలబాలాజీ కళ్యాణం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు
- సుందరంగా ముస్తాబైన ఆలయం

ప్రజాశక్తి-మామిడికుదురు

తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సంకల్ప బలంతో వైనతేయ నదీతీరాన అప్పనపల్లిలో మొల్లేటి రామస్వామి కొబ్బరికొట్టులో బాలబాలాజీ స్వామిగా ఆవిర్భవించారు. కొబ్బరి కొట్టులో నేటికీ పాత ఆలయంలో స్వామి దర్శనం కొన సాగుతోంది. 1970లో నవీన ఆలయ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. 1981లో దేవదాయశాఖ స్వాధీనం చేసుకుంది. 1990 జులై4న టిటిడి ఆలయానికి మూలవిరాట్‌ను ఉచితంగా అందించింది.

కురులతో సిరులు

బాలబాలాజీ స్వామికి యాత్రికులు సమర్పించే కురులే ప్రతి ఏటా రూ.లక్షలలో సిరులు కురిపిస్తున్నాయి. ఇతర దేశాలతో పోల్చి తే ఈ ప్రాంతం వాసులు శిరోజాలు అందంగా ఆరోగ్యంగా నాణ్యమైనవిగా ఉంటాయి. ఈ ప్రాంతాల వారు జుట్టును బాగా పెంచడంతో పాటు జాగ్రత్తగా పరిరక్షిస్తుంటారు. అందుకే ఈ ప్రాంతాల్లో తల వెంట్రుకలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉంది.



అప్పనపల్లిలో నూతనంగా నిర్మించిన గోశాల

నిత్యాన్నదానానికి నాంది ఇక్కడే

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అనే సూక్తిని పాటిస్తూ సుదూర ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తుల దైవదర్శనం ఆపై కడుపు నిండా అన్నం పెట్టడం ఆనవాయితీ. రాష్ట్రంలో దేవాలయాల్లో తొలి అన్నదానానికి నాంది పలికిన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయం.



బాలబాలాజీ స్వామి వారి కల్యాణ త్రిమూర్తులు

యాత్రికులను ఆకట్టుకుంటున్న గోశాల



బాల బాలాజీ స్వామికి యాత్రికులు మొక్కుబడిగా సమర్పించిన గోవుల ప్రతిరూపమే గోశాల. దాతల సహకారంతో ఆలయానికి సమీపంలో నిర్మించిన గోశాల భక్తులను ఆకట్టుకుంటుంది. ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖ దృష్టి సారించాలి.

-పాటి గోవిందరావు స్థానికులు, అప్పనపల్లి

దినదినాభివృద్ధి చెందుతోన్న అప్పనపల్లి



బాలబాలాజీ స్వామి ఆలయం ఆధ్యాత్మికంగా దినదినాభివృద్ధి చెందుతోంది. సమీపంలో విశ్వేశ్వర స్వామి, కనకమహాలక్ష్మి ఆలయాలు యాత్రికులకు దర్శన మిస్తున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంతో మెరుగైన సదుపాయాలు ఉండటంతో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.

- కంకిపాటి నరసింహారావు, స్థానికులు, అప్పనపల్లి

కళ్యాణ మహోత్సవాలకు సకల ఏర్పాట్లు



స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. యాత్రికులకు మౌలిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్య వేక్షణకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశాం. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధి కారులకు జెడ్‌పి అతిథిగృహంలో వసతి సదుపాయం కల్పించాము.

- గ్రంధి మాధవి, ఆలయ సహాయ కమిషనర్, అప్పనపల్లి

అప్పనపల్లికి పురాణ ప్రాశస్త్యం



అప్పనపల్లికి పురాణ ప్రాశస్త్యం ఉంది. ఉత్తరవాహినిగా ప్రవహించే నదీతీరాన ఈ క్షేత్రం వెలిసింది. శంకచూడుడనే నాగును కాపాడటానికి జీమూత వాహనుడు అనే విద్యాధర చక్రవర్తి బలిఅయ్యాడు. ఆయన దేహార్పణ ఫలించిన ప్రాంతం కావడంతో 'అర్పణపల్లి'గా వెలసి నేడు అప్పన పల్లిగా రూపాంతరం చెందింది. వెంకన్న బాల్యరూపం చూసి తరించాలని వకులమాతకోరిన వరప్రభావమేస్వామి బాలబాలాజీగా వెలిశారు.

-కంకిపాటి హిమంతరావు, స్థానిక సీనియర్ సిటిజన్, అప్పనపల్లి

ప్రతి జీవరాశిని కాపాడుకుందాం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రకృతిలో ఉన్న ప్రతి జీవ రాశిని కాపాడుకునే బాధ్యత మానవునిపై ఉందని జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి వియల్ఎన్ ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ పురస్కరించు కుని జూన్ 5వ తేదీన నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందిం చారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అడవులను నరక డం అరికట్టాలని, వృక్ష సంపద వృద్ధి చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను వేల సంఖ్యలో నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్ మాట్లాడుతూ ఇంధన వనరులను పొదుపుగా వాడాలని అన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్స్ వాడకాన్ని మానివేయాలని, వాటికి బదులుగా కాగి తపు సంచులను, గుడ్డ సంచులను, నారా సంచులను వినియో గించాలని సూచించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి పర్యా వరణం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. రిసోర్ పర్సన్ వియస్‌వి. రమణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు డి.రవికుమార్, వి.అరుణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీ నియామకం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవాలకు కమిషనర్, దేవదాయ - ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి ఉత్తర్వులు ప్రకారం తొమ్మిది మందితో ఉత్సవకమిటీ నియమించినట్లు ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి ఆదివారం తెలిపారు. తులా ఉమా ముల్లేశ్వరస్వామి, బొంతు ఆనంద రావు, పడవల వివిఎన్.మల్లేష్, కామిశెట్టి సూర్య చంద్ర దాస్, మాకే సత్య శ్రీధర్, కోలా రాంబాబు, పాటి వెంకట్రావు, కేతా శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావు సభ్యులతో ఉత్సవ కమిటీ నియమించామని ఆలయ సహాయ కమిషనర్ తెలియజేశారు.



బాలబాలాజీ ఉత్సవ కమిటీ

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

-ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులకు ప్రజాప్రతినిధులు హామీ

ప్రజాశక్తి - కాకినాడ

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్ఎలు చినరాజప్ప, పంతం నానాజీ హామీ ఇచ్చారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) జిల్లా నాయకత్వం వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపిందిరు. ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ జర్నలిస్టుల సమస్యలను వివరించారు. నిబంధనలను తొలగించి అక్రిడిటేషన్ కార్డులను అందరికీ జారీ చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎండి అధికార్, ఎస్‌కె మున్ని, జిల్లా నాయకులు పుర్రె త్రినాథ్, బొండాడ భాస్కర్, బిందాన సురేష్, ధర్మరాజు, రామ్ ప్రసాద్, కొమ్ము సురేంద్ర, రెడ్డి, నక్క శ్రీను, రాము, పండు పాల్గొన్నారు.



కాకినాడ ఎంపీని అభినందిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

ఘనంగా భీమేశ్వరుని సంప్రోక్షణ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో సంప్రోక్షణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వహణా ధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అర్చకులు సన్నిధిరాజు వెంకన్న శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కాలభైరవ స్వామిని దర్శించుకుని వాయు లింగానికి అభిషేకం నిర్వహించారు. ఆలయ నంది మండపంలో బాలాత్రిపురసుందరీ సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామిఉత్సవ మూర్తులను దర్శించి పూజాధికాలు నిర్వహించారు. అలాగే సంప్రోక్షణ పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు అడబాల కుమారస్వామి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు బాడితమాని త్రిమూర్తులు, పడాల సత్య పుత్ర సూర్య నారాయణ, చంద్రు గోపాలకృష్ణ, మునిసిపల్ కౌన్సిలర్ బులుసు శ్రీనివాస్, పలువురు మాజీ మునిసిపల్ కౌన్సిలర్లు టిడిపి మాజీ అధ్యక్షుడు గోలి సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంఎల్ఎ చినరాజప్ప ప్రారంభించారు.



ఎంఎల్ఎ చినరాజప్పకు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అధికారులు

నేటి నుంచి దర్శనాలు

సోమవారం ఉదయం నుంచి భీమేశ్వర స్వామి దర్శనాలకు భక్తులను యధాప్రకారం అనుమతిస్తున్నట్లు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం తెలిపారు. వారం రోజుల అనంతరం స్వామివారి యోగ లింగానికి అభిషేకాలు జరుగుతాయని అన్నారు.

పిడుగు పడి 2 కొబ్బరి చెట్లు దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వాకతిప్ప గ్రామంలో రెండు కొబ్బరి చెట్లపై పిడుగు పడి కాలిపోయింది. పిడుగు పడే సమయంలో అతి భారీగా శబ్దం రావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా కొబ్బరి చెట్ల నుంచి మంటలు రావడంతో చూసేందుకు కొంతమంది ఆసక్తి చూపగా, మరి కొంతమంది ఆ ప్రాంతం నుంచి పరుగులు తీశారు.

ఒకే చోట రెండు ప్రమాదాలు
-ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామ జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద ఆదివారం రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి...విజయవాడ నుంచి విశాఖపట్నం వెళుతున్న ఇన్నోవా కారు ముందు టైరు పేలడంతో అదుపుతప్పి మధ్యలో ఉన్న డివైడర్ ఎక్కి స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రయాణిస్తున్న నలుగురికి ఏ విధమైన గాయాలు కాకుండా బయటపడ్డారు. దీన్ని పరిశీలించేందుకు హైవే రోడ్ సేఫ్టీ వాహనం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని మరొక కారులో పంపించేందుకు చర్యలు చేపడుతుండగా, అన్నవరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న మరొక కారు పోలీస్ వాహనాన్ని బలంగా ఢీకొని పక్కనే పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే హైవే అంబులెన్స్‌పై జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కొరకు రాజమహేంద్రవరం తరలించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

లౌకిక వాదంతో రచయితలు పని చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజాస్వామిక లౌకికవాద దృష్టితో రచయితలు పనిచేయాలని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో అరసం కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 సంవత్సరాల అరసం ఆవిర్భావ వికాసాల గురించి వివరించారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలను ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. మానసిక వికాసానికి దోహదపడే గ్రంథాలయాలను పునర్జీవింప చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహాసభకు కన్వీనర్స్‌గా గండి స్వామిప్రసాద్, వేదుల శ్రీరామశర్మ (శిరీష) వ్యవహరించారు. మహాసభకు కవి, రచయిత దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు, చెరుకుమల్లి సింగారావులు మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో 48 మంది వరకూ వర్ధమాన కవులు తమ కవితలను వినిపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు

నూతన కార్యవర్గం ఎన్నిక

కాకినాడ జిల్లా అరసం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా పత్సమట్ల సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా పి.పద్మజావాణి, గౌరవ సలహాదారులుగా వేదుల శ్రీరామ్‌శర్మ, ఆర్.సత్యభామ, ఉపాధ్యక్షులుగా వాడపల్లి వెంకటరమణమ్మ, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, కొల్లు ప్రసన్నకుమార్, కార్యదర్శులుగా ఎం.ఉండవల్లి, అద్దేపల్లి జ్యోతి, అవధానులు మణిబాబు, కార్యవర్గ సభ్యులుగా మధునాపంతుల సత్యనారాయణమూర్తి, రాంపల్లి వెంకటరమణ, గుండు శ్రీనివాసరావు, దాడి గోవిందరావు, జి సావిత్రి ప్రసాద్, రాధిక, వక్కలంక శారద, ఎన్వి పద్మావతి, తోకల ప్రసాదరావు, సివివి సత్యనారాయణ, ఎన్వీఎస్. ఇందిర, డాక్టర్ ఎన్ సూర్యనారాయణ, డాక్టర్ పిఎస్ ప్రకాశరావు, ఆర్‌వివి. రాజా ఎన్నికయ్యారు.

ప్రజాపక్షం శ్రీ శ్రీ సాహిత్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదంటూ తన కవిత్వాన్ని శ్రీశ్రీ ప్రజలకు అంకితం చేశాడని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోషుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ 41వ వర్ధంతి సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. చిన్ననాటి నుంచే కవిత్వం రాయడం ప్రారంభించిన ఆయన అనేకమంది ప్రభావితంతో కవితలు రాశారన్నారు. చివరికి తనదైన శైలితో శ్రమజీవుల దృక్పథంతో సాహిత్య సృష్టి చేసి కవితా ప్రయోజనానికి ఆయన మార్గదర్శకులు అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కవి చల్లా విశ్వనాథం, ప్రజానాట్యమండలి కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, మహపాతిన రాంబాబు, అమృత, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, కూనిరెడ్డి అరుణ, తాటిగడప సుబ్బారావు, భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి, విమలారాణి, కాశీ విశ్వనాథ్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీ.శ్రీ. చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, కళాకారులు

సమాజ సేవలో సేవా సంస్థల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పరోపకారం సంతృప్తినిస్తుందనే నమ్మకంతో పలువురు స్వచ్ఛంద సేవను వారి జీవితంలో భాగంగా చేసుకుని సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారని డాక్టర్ బొండా సూర్యారావు అన్నారు. రమణయ్యపేట పారిశ్రామిక వాడలో 'మీకోసం రత్నశ్రీ సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘజీవి అయిన మనిషి ఈ సమాజం తనకేమిచ్చిందని కాకుండా తాను సమాజానికి ఏమి చేయగలిగానని ప్రశ్నించుకోవాలని అన్నారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ పరులకు సేవ చేయడం, సకల ప్రాణుల పట్ల దయ కలిగి ఉండడం గొప్ప వ్యక్తిత్వమన్నారు. సేవా సంస్థ వ్యవస్థాపకురాలు లక్ష్మీదుర్గ మాట్లాడుతూ చిరుద్యోగినైన తాను సమాజ సేవలో సంతృప్తి పొందాలనే లక్ష్యంతో సేవా సంస్థను స్థాపించానని అన్నారు.

రాష్ట్ర రగ్బీ జట్టుకు సునంద తేజశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - కరప

స్థానిక అన్నవరం సత్యదేవ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న గురజనాపల్లి గ్రామానికి చెందిన సునంద తేజశ్రీ రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపికైందని ప్రిన్సిపల్ చింత సూర్యనారాయణమూర్తిరాజు తెలిపారు. సునంద తేజశ్రీ రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. మే 31 నుంచి జూన్ 1వ తేదీ వరకు తిమ్మాపురం, విశాఖపట్నంలలో జరిగిన జూనియర్ రగ్బీ ఛాంపియన్ షిప్‌లో సునంద తేజశ్రీ తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొని జిల్లా జట్టును తృతీయ స్థానంలో నిలిపిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సునంద తేజశ్రేణి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేశారన్నారు. జూన్ 19 నుంచి 20 వరకు పూణేలో గల చత్రపతి శివాజీ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా జూనియర్ బాలికల రగ్బీ ఛాంపియన్ షిప్ లో సునంద తేజశ్రీ పాల్గొంటుందని తెలిపారు. సునంద తేజస్విని అధ్యాపక బృందం, యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రసాదరావు అభినందించారు.

పామాయిల్ చెట్టు పడి గేదె మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం రామయ్య పాలెం గ్రామంలో గాలితో కూడిన వర్షం రావడంతో పామాయిల్ తోటలో గొల్లవిల్లి రాములు అనే రైతుకు సంబంధించిన గేదెపై పామాయిల్ ఉన్న సమయంలో చెట్టు పడి 11 కెవి వైర్లు పై పడి వైర్లు పడడంతో గేది మృతి చెందింది అని రైతు ఆవేదన వ్యక్తం చేశారు ఈ గేద విలువ సుమారు లక్ష రూపాయలు ఉండవచ్చని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

ప్రజాశక్తి - అన్నవరం(తొండంగి)


తొండింగ్ మండలం కొమ్మనాపల్లి గ్రామంలో గత నాలుగు రోజులుగా గ్రామస్తుల్లో ఆందోళన కలిగిస్తున్న డయేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా క్రమేపి తగ్గుతుంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు 8 కేసులు నమోదు అవ్వగా ముగ్గురు రోగులను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆదివారం జిల్లా వైద్య శాఖ అధికారి గ్రామంలో మెడికల్ క్యాంపును సందర్శించారు. గ్రామస్తులు కుళాయి నీళ్ల తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో డ్రెయినేజీలో పూడికను తొలగిం చాలని, బ్లీచింగ్‌ను అధికంగా వాడాలని ఆదేశించారు. గత నాలుగు రోజులుగా గ్రామాల్లో విజృంభించిన డయేరియా కేసులు ఆదివారం నాటికి తగ్గడంతో గ్రామస్తుల్లో ఆందోళన తగ్గింది.

'సంకురాత్రి' సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి - కరప

కిరణ్ కంటి ఆస్పత్రి వారి సంకురాత్రి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. ఆదివారం కాకినాడ రూరల్ కొవ్వూరు గ్రామంలో కిరణ్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని రూరల్ జనసేన మండల అధ్యక్షుడు కర్రెడ్ల గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో జరుగుతున్న కంటి వైద్య పరీక్షలను ఎంఎల్ఎ పరిశీలించారు. 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 40 మందికి ఆపరేషన్లు అవసరం అవుతున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే ఆధిక్యత



మాజీ సర్పంచ్‌ను అభినందిస్తున్న క్లస్టర్ కన్వీనర్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విజయం వెనుక సమిష్టి కృషే కారణమని, తద్వారానే పంచాయతీలో ఆధిక్యతను సాధించగల్గామని మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ముత్యాలమ్మ గుడి వద్ద టిడిపి క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జ్‌ల ఆధ్వర్యంలో వాసంశెట్టి శ్రీనివాస్‌కు ఘనంగా సత్కారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తాళ్లరేవు పంచాయతీలో ఎన్నడూ లేని విధంగా అన్ని బూత్‌లలోనూ ఆధిక్యత సాధించడం వెనుక కార్యకర్తల కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాకపల్లి చిరంజీవి, కుడిపూడి దుర్గాప్రసాద్, పితాని హేమలత, బొంతు శ్రీనివాస్, పినపోతు వీరబాబు, పిల్లి నరసింహమూర్తి, గుబ్బల శ్రీను, కాంట్రేకులు శ్రీను, పితాని శ్రీను వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, రాజమహేంద్రవరం
I.P. 41/2019

Between:
దొడ్డ వెంకటేశ్వరరావు -పిటీషనర్
మరియు
R-1: వానపల్లి రమేష్, S/o. బంగారయ్య, హిందువు, వయస్సు 47 సంవత్సరములు, సెకండ్ ఫ్లోర్, శ్రీ విద్యా రెసిడెన్సీ, ఆళ్వార్ నగర్, లాలాచెరువు, రాజమహేంద్రవరం.
R-2: ఒగ్గు శివ, S/o. రాము, హిందువు, వయస్సు 42 సంవత్సరములు, డో.నెం. 11-106/1, రామాలయం వీధి, జి.మామిడాడ. -రెస్పాండెంట్స్

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పైన చెప్పబడిన IP 41/2019 వ్యాజ్యంలో రెస్పాండెంట్స్ ఇద్దరూ శ్రీ కోర్టు వారు పంపిన నోటీసులు తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్న కారణంగా పబ్లికేషన్ ద్వారా నోటీసులుకై శ్రీ కోర్టు వారు అనుమతించినారు. కావున పై నంబర్ వ్యాజ్యం దివి. 27-06-2024వ తేదీన వాయిదా ఉండి యున్నది. కావున సదరు **27-06-2024వ తేదీన ఉదయం 10.30లకు** పై ఇరువురు స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై తమ వివరణ ఇచ్చుకోగలరు. లేనియెడల పై IP గ్రంధమును శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్స్ పరోక్షమున తీర్మానం చేయుదురు.

ఎ.అనంతశర్మ, అడ్వకేట్
రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం-6
11-06-2024 సెల్:9494962665